ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
06-09-2024
శుక్రవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 07 | పేజీలు : 8 | వెల : 4
JB జయభేరి



## ఖమ్మంలో ఇంకా కన్నీళ్లే...

**ఖమ్మం, సెప్టెంబర్ 5:**

ఖమ్మం నగరంలో ఎటు చూసినా నీళ్లే కనిపిస్తున్నాయి. వరదకు చెల్లాచెదురుగా మారిన బాధితుల కన్నీళ్లే తారసపడుతున్నాయి. ఇంకా ఖమ్మం నగరం జల దిగ్బంధంలోనే ఉంది. గోదారిలా ఉగ్ర రూపం చూపించిన మున్నేరు ఇప్పుడిప్పుడే శాంతిస్తోంది. 36 అడుగుల పూర్తి స్థాయి నీటి మట్టానికి ప్రవహించిన మున్నేరు ఖమ్మం నడి బొడ్డున భయానక వాతావరణమే సృష్టించింది. వరద తాకిడికి ఇంకా అనేక ప్రాంతాలు ముంపులోనే ఉండిపోయాయి. వేలాది మంది కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. కొంచెం వరద తగ్గడంతో బురదలో

...మిగతాది 2 లో




## భారత్ లో సింగపూర్ భారీగా పెట్టుబడులు

**జయభేరి, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5:**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రెండు రోజుల సింగపూర్ పర్యటనలో ఉన్నారు. బుధవారం సింగపూర్ చేరుకున్న ఆయనకు అఖండ స్వాగతం లభించగా, గురువారం సింగపూర్ పార్లమెంట్ లో కూడా ఘనస్వాగతం లభించింది. అంతకుముందు ప్రధాని మోదీ బ్రూనైలో పర్యటించారు. ఇక, రెండో రోజు సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో ప్రధాని మోదీ ప్రతినిధుల స్థాయి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ఇతర ఉన్నతాధికారులు

...మిగతాది 2 లో

## కేసీఆర్ మౌనమే వ్యూహామా...



**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 5 :**

తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ చాలా రోజుల తర్వాత ఇటీవల బయట కనిపించారు. బయట అంటే.. ఆయన ఫామ్ హౌస్‌లోనే జైలు నుంచి వచ్చిన కుమార్తెకు స్వాగతం చెబుతూ కనిపించారు. ఆ దృశ్యాలు బయటకు వచ్చాయి. అప్పటి వరకూ దాదాపుగా రెండు నెలలు ఆయన బయట కనిపించకపోయే సరికి ఆరోగ్యం బాగో లేదన్న పుకార్లు కూడా వచ్చాయి. కానీ కేసీఆర్ వేటినీ పట్టించుకోలేదు. బయటకు రాలేదు. కవిత జైలు నుంచి వచ్చిన తర్వాత ఆయన కార్యచరణ ఉంటుందని.. వెంటనే రైతుల కోసం టూర్ కి వెళ్తారని బీఆర్ఎస్ వర్గాలు లీక్ ఇచ్చాయి. కానీ అది లీక్ గానే మిగిలింది .ఆయన సైలెంట్ గానే ఉన్నారు. ఇంతటి వరదలు వస్తే ప్రతిపక్ష నేత కేసీఆర్ కనీసం బయటకు వచ్చి కూడా చూడలేదని.. అలాంటి ప్రతిపక్షానికి తాము ఎలా సమాధానం చెప్పాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు ప్రతిపక్ష నేత ఫామ్ హౌస్ కు పరిమితం అయితే.. ఆయన కుమారుడు అమెరికాలో జల్సా చేస్తున్నారని.. అక్కడ్నుంచి సోషల్ మీడియాలో విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ను రేవంత్ టార్గెట్ చేయడం ఇదే మొదటి సారి కాదు. అసెంబ్లీ సమావేశాలకు రాకపోవడం దగ్గర్నుంచి కేసీఆర్ ఎందుకు బయటకు రారని పదే పదే ప్రశ్నిస్తూ వస్తున్నారు. కానీ బీఆర్ఎస్ వద్ద సరైన సమాధానమే లేకుండా పోయింది.అయితే రైతు రుణమాఫీ ఇతర అంశాలపై కాంగ్రెస్ తీరును ఎండగట్టేందుకు కేసీఆర్ ప్రజల్లోకి వెళ్లేందుకు రెడీ అయ్యారని.. రూట్ మ్యాప్ పై కసరత్తు కూడా చేశారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. వాతావరణం సాధారణంగా ఉంటే ఈ పాటికి ఆయన బస్సు తెలంగాణ రోడ్లపై పరుగులు పెడుతూ ఉండేదని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని

2 లో

## బెయిల్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్




**జయభేరి, న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 5:**

ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించి సీబీఐ కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పును నిరజర్వ్ చేసింది. కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం గురువారం సుదీర్ఘంగా విచారించింది. కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. లిక్కర్ పాలసీ కేసులో సీబీఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో అసలు కేజ్రీవాల్ పేరు లేదని సింఘ్వీ వాదించారు.ఇటీవల కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ సీఎం సమాజానికి ప్రమాదకరమేమి కాదని సుప్రీంకోర్టు పేర్కొందని, బెయిల్‌పై విడుదల చేయాలని రెండుసార్లు సుప్రీంకోర్టు, ఒకసారి ట్రయల్ కోర్టు ఆదేశించాయని ధర్మాసనానికి తెలిపారు. ఒకసారి ఎన్నికల ప్రచారం కోసం సుప్రీంకోర్టు కేజ్రీవాల్‌ను బెయిల్‌పై విడుదల చేసిందని, మరోసారి ఈడీ కేసులో బెయిల్ లభించిందని చెప్పారు. కేజ్రీవాల్ రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్నారని.. సమాజానికి ప్రమాదం లేదని వాదించారు. రెండేళ్లుగా సీబీఐ ఆయనను అరెస్టు చేయలేదని.. అయితే, జూన్ 26న మాత్రమే

...మిగతాది 2 లో

## మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ

### దంతేవాడలో జగన్ చనిపోయినట్టేనా..?

ఛత్తీస్ గఢ్‌లో మావోయిస్టుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఇటీవల దంతెవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్‌లో తొమ్మిది మంది మావోయిస్టులు మృతిచెందారు. అయితే వీరిలో మావోయిస్టు అగ్రనేత మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ @దాదా రణదేవ్ దాదా ఉన్నారు. కేంద్ర మిలిటరీ ఇన్చార్జ్, మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్ బార్డర్ ఇంచార్జ్ గా వ్యవహరించిన ఏసోబు అలియాస్ జగన్ మృతిచెందినట్టు దంతేవాడ పోలీసులు ప్రకటించారు.



...మిగతాది 2 లో

## మల్లారెడ్డి నెక్స్ట్ టార్గెట్...



**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 5:**

హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ హైడ్రా. ఈ పేరు వినగానే ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో అక్రమ కట్టడాలు నిర్మించిన వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయి. ఎప్పుడు, ఎక్కడి నుంచి, ఏ బుల్డోజర్ వచ్చి తమ ఇళ్లు కూల్చేస్తుందో అని భయం భయంగా గడుపుతున్నారు. ఈ క్రమంలోనే హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్.. నగరంలోని చెరువులు, కుంటలు, నాలాలు కబ్జా చేసినట్లు ఫిర్యాదులు అందిన ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అడ్డాలో ఏవీ రంగనాథ్ అధికారులతో కలిసి పర్యటించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం మేడ్చల్ జిల్లా జవహర్ నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మేకల కావ్యకు చెందిన ఫామ్‌హౌస్‌కు అనుమతులు లేవని గుర్తించారు. అంతేకాకుండా అంబేడ్కర్ నగర్‌లోని ఇంద్రా చెరువు, డంపింగ్ యార్డు సమీపంలోని నాలా ఆక్రమణకు గురైనట్టు హైడ్రా అధికారులు తేల్చారు. ఇక ఫామ్‌హౌస్‌కు అనుమతులు జారీ చేసిన అధికారులపై.. చెరువు ఆక్రమణలపై అలసత్వం ప్రదర్శించిన అధికారులపైనా చర్యలు తీసుకోనున్నట్టు ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. చెరువులు, కుంటలు, నాలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన బడా బాబులను మాత్రం ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. ఫామ్‌హౌస్‌లను, నిర్మాణాలను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేస్తామని రంగనాథ్ స్పష్టం చేశారు.




## రామోజీ సిటీలోకి బుల్డోజర్లు వెళ్తాయా

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 5:**

తెలంగాణ ఉద్యమ సమయంలో రామోజీ ఫిలిం సిటీని 1000 నాగళ్ళతో దున్నుతానని కేసీఆర్ శపథం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయాన్ని మర్చిపోయారు. పైగా మార్గదర్శి కేసులో జగన్ ఉరిమి వస్తుంటే.. రామోజీరావును జైలుకు వెళ్లకుండా కేసీఆర్ కాపాడారు..ఎన్ కన్వెన్షన్ సెంటర్ విషయంలోనూ నాగార్జున పై కేసీఆర్ ఇదే స్థాయిలో ఉదారత చూపారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం హైదరాబాదులో ఆక్రమణలను పడగొడుతోంది. చెరువులు, బఫర్ జోన్లలో నిర్మించిన నిర్మాణాలను కూల్చేస్తోంది.తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ మహానగరంలో హైడ్రా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సృష్టిస్తున్న సంచలనం అంతా ఇంతా కాదు. ఇప్పటికే పాలు చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను

...మిగతాది 2 లో

## ముఖ్యమంత్రి రేవంత్ తో ఐబీఎం వైస్ ప్రెసిడెంట్ భేటీ



**జయభేరి, హైదరాబాద్:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రపంచ దిగ్గజ టెక్ సంస్థ ఐబీఎం వైస్ ప్రెసిడెంట్ ఎమర్జింగ్ టెక్ అడ్వకెసీ డానియెలా కాంబ్ మర్యాదపూర్వకంగా కలిశారు.హైదరాబాద్ హెఐసీసీ వేదికగా జరుగుతోన్న గ్లోబల్ ఏఐ సదస్సు ప్రాంగణంలో వీరు సమావేశమయ్యారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏ ఐ, భవిష్యత్తు నూతన ఆవిష్కరణల అన్వేషణ తదితర అంశాలపై చర్చించారు.తెలంగాణ రాజధాని హైదరాబాద్ శివారు ఫ్యూచర్ సిటీలో 200 ఎకరాల ప్రాంగణంలో అధునాతన ఏఐ సిటీని నిర్మిస్తోన్న విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ప్రస్తావించారు. ఫ్యూచర్ సిటీని ఏఐ రాజధానిగా తీర్చిదిద్దాలనే తెలంగాణ ప్రభుత్వ ప్రణాళికల పట్ల ఐబీఎం వైస్ ప్రెసిడెంట్ ఆసక్తి కనబరిచారు.ఈ సమావేశంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, ఉన్నతాధికారులు, ఐబీఎం ప్రతినిధులు పాల్గొన్నారు.

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఖమ్మంలో ఇంకా కన్నీళ్లే...

కూరుకుపోయిన ఇండ్లను చూసి బాధితులు ఘోల్లుమంటున్నారు. విలువైన సామాన్లు కొట్టుకుపోయాయి. తిండి గింజలు, తాగునీరు కూడా లేకుండా వరద ముంచేయడంతో బాధితుల వేదన వర్ణనాతీతంగా మారింది. ఒకటో అంతస్తు వరకు నీళ్లు రావడంతో ఏం చేయాలో తెలియక కట్టుబట్టలతో ప్రాణాలు అర చేతిలో పెట్టుకొని పరుగులు తీశామని బాధితులు వాపోతున్నారు. ఖమ్మం నగరంలో మున్నేరు ఉగ్రరూపం దాల్చడంతో చుట్టూ ఉన్న రామన్నపేట నుంచి దానవాయిగూడెం, బ్రిడ్జి డౌన్, ఎఫ్సీఐ గోడౌన్, ఎంబీ గార్డెన్ పూర్తిగా మునిగి పోయాయి. నయా బజార్ సర్కిల్ నుంచి జూబ్లీ క్లబ్, రైల్వే బ్రిడ్జి వరకు నాలుగు అడుగుల లోతు వరద నీరు వచ్చి చేరింది. బైపాస్ రోడ్ల మీద ఉన్న లారీలు సైతం మునిగిపోయాయి. మోతీనగర్, బొక్కల గడ్డ, నయాబజార్, మంచికంటి నగర్, సుందరయ్య నగర్, ప్రకాశ్ నగర్, శ్రీనివాస్ నగర్ కాల్వకట్ట, ధంసలాపురం నీట మునిగాయి. మూడో పట్టణానికి రంగనాయకుల గుట్ట పెట్టని గోడలా నిలిచింది. ఇదే లేకపోతే గాంధీ చౌక్ నుంచి మొదలకొని ముస్తఫానగర్ మీదుగా జరిగే ప్రమాదం ఊహించుకుంటేనే వెన్నులో వణుకు పుట్టే పరిస్థితి. రైల్వే ట్రాక్ దాటి రాపర్తి నగర్, కూరగాయల మార్కెట్ దాక వరద పోటెత్తింది. 30 ఏళ్ల కిందట వచ్చిన వరద కంటే ఇప్పుడు వచ్చిన వరద దారుణమని బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. సర్వం కోల్పోయామని బోరుమంటున్నారు.ముప్పై ఏళ్ల క్రితం బైపాస్ రోడ్డు మీదకు మాత్రమే నీళ్లు వచ్చాయి. కానీ తాజాగా మున్నేరు వరద ఖమ్మం చరిత్ర రికార్డ్ నే బ్రేక్ చేసింది. నయాబజార్ సర్కిల్ నుంచి జూబ్లీ క్లబ్, రైల్వే బ్రిడ్జి వరకు నాలుగు అడుగుల లోతు వరద వచ్చింది. బైపాస్ రోడ్ల మీద ఉన్న లారీలు సైతం మునిగిపోయాయి. మోతీనగర్, బొక్కలగడ్డ, నయాబజార్ వెనుక భాగం, మంచికంటి నగర్, సుందరయ్యనగర్, ప్రకాశ్ నగర్, శ్రీనివాస్ నగర్, కాల్వకట్ట, దంసలాపురం కాలనీల్లో ఇండ్లు మొత్తం మునిగిపోయాయి. శనివారం రాత్రి అతి భారీ వర్షం కురిసింది. దీంతో ఆదివారం ఉదయం నుంచే మున్నేరుకు వరద ఉధృతి మొదలైంది. నిమిషాల వ్యవధిలోనే వరద పెరుగుతున్న తీరును అంచనా వేయడంలో అధికారులు పూర్తిగా విఫలం అయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఫలితంగానే చుట్టుపక్కల కాలనీల ప్రజలు వరద బీభత్సానికి గురయ్యారు. మున్నేరు వరద రెప్పపాటున రావడంతో రెండు మూడు ఫ్లోర్లు బిల్డింగ్ ఉన్న వారు సైతం పైకి ఎక్కి ప్రాణాలు రక్షించుకున్నారు. ప్రతి ఒక్కరి ఇంట్లో అన్ని సామాన్లు తడిచి ముద్దయిపోయాయి.ప్రకాశ్ నగర్ లోని టింబర్ డిపోలు నీటిలో కొట్టుకుపోయి నేలమట్టమయ్యాయి. ప్రతి దుకాణంలోని టేకు కర్రలు, మిషన్లు నీటిలో మునిగి భారీ ఆస్తి నష్టాన్ని మిగిల్చింది. మున్నేరు పరివాహక ప్రాంతానికి దగ్గరగా ఉన్న ప్రతి ఇంటికి పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. 31వ డివిజన్ లో పెద్దమ్మ తల్లి గుడి ప్రాంతంలో మున్నేటికి ఆనుకొని నిర్మించిన వెంచర్ లో ఇండ్లు కట్టుకున్న వారందరికీ వరద కన్నీటిని మిగిల్చింది. 15 అడుగులకు పైగా వరద రావడంతో ఇండ్లలోని సామాన్లు మొత్తం బురదలో చిక్కుకుపోయాయి. ఓ పాల వ్యాపారికి గేదెల మరణం తీవ్ర నష్టాన్ని చేకూర్చింది. వరద తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఇండ్లలో చేరిన వరదను తొలిగించుకునే పనిలో పడ్డారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లు ఖమ్మం జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే ఖమ్మం నగరంలో మున్నేరు ఉధృతి కారణంగా చోటు చేసుకున్న వరద బీభత్స సమయంలో సహాయక చర్యలను చేపట్టడంలో ముగ్గురు మంత్రులు పూర్తిగా విఫలమయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భట్టి విక్రమార్క కేవలం తన నియోజకవర్గమైన మధిరకే పరిమితమయ్యారు. పొంగులేటి, తుమ్మల మున్నేరు పరివాహక ప్రాంతంలో పర్యటించినప్పటికీ సరైన రీతిలో స్పందించి అధికారులను పరుగులు పెట్టించలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రకాష్ నగర్ బ్రిడ్జ్ పై చిక్కుకుపోయిన తొమ్మిది మందిని కాపాడటంలో స్థానిక ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరరావు విఫలమైన తీరుపై ప్రతిపక్షాలు సైతం మండిపడుతున్నాయి.సకాలంలో హెలికాప్టర్ ను తెప్పించి ఉంటే తుమ్మలకు క్రెడిట్ దక్కేది. ఒక సాధారణ జేసీబీ డ్రైవర్ సాహసం చేసి రాత్రి 10 గంటల సమయంలో తొమ్మిది మందిని కాపాడటంతో తుమ్మల సమర్ధతపై మరిన్ని విమర్శలు గుప్పుమన్నాయి. గొప్ప సాహసం చేసిన ఆ డ్రైవర్ ను అభినందించడంలో కూడా అధికార పార్టీ ప్రతినిధులు విఫలమయ్యారు. ఆ డ్రైవర్ ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవి చంద్ర అభినందించడంతో స్థానిక మంత్రి తుమ్మల మరింత ఇరుకున పడ్డారు.

## కేసీఆర్ మౌనమే వ్యూహమా...

చీల్చి చెండాడేవారని అంటున్నారు. వర్షం తగ్గిన తర్వాత మంచి రోజు చూసుకుని కేసీఆర్ ప్రజల్లోకి వెళ్తారని చెబుతున్నారు. అయితే ప్రజల్లోకి వెళ్లడానికి ఇంత కన్నా మంచి సందర్భం ఏమి ఉంటుందని.. ప్రభుత్వ వైఫల్యంపై విరుచుకుపడితే పార్టీకే మేలు కదా అని బీఆర్ఎస్ నేతల్లోనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. కేసీఆర్ రాజకీయ వ్యూహాల్లో మౌనానిది కీలక పాత్ర. ఆయన కీలకమైన విషయాల్లో మౌనంగా ఉంటారు. సరైన సమయం చూసి ఎంటర్ అవుతారు. సిక్సర్ కొడతారు. అప్పటి వరకూ ఆయన చుట్టు ముసురుకున్న వ్యతిరేకత అంతా పాజిటివ్ గా మారుతుంది. రేవంత్ ప్రభుత్వానికి సమయం ఇచ్చేందుకే ఆయన సైలెంట్ గా ఉన్నారని.. ఇవాళ కాకపోతే రేపు.. రేపు కాకపోతే ఎల్లుండి ఆయన ప్రజల్లోకి వస్తారని ..కాంగ్రెస్‌కు చుక్కలు చూపిస్తారని బీఆర్ఎస్ వర్గాలు నమ్ముతున్నాయి. అయితే మంచి అవకాశాల్ని కోల్పోతున్నామన్న భావన మాత్రం కొంత మంది బీఆర్ఎస్ నేతల్లో కనిపిస్తోంది. కేసీఆర్ మళ్లీ యాక్టివ్ అయితే పార్టీ పుంజుకునే అవకాశం ఉందని, అదే సమయంలో అనుకున్న సంఖ్యలో వలసలు లేకపోతే అనర్హత వేటు పడే ప్రమాదాన్ని ఎదుర్కొవాల్సి వస్తుందని కొందరు ఎమ్మెల్యేలు భయపడుతున్నట్లు చెబుతున్నారు. కేసీఆర్ కూడా తనను కలిసిన ఎమ్మెల్యేలతో వలస వెళ్లిన వారిపై అనర్హత వేటు వేయించడంతోపాటు కాంగ్రెస్ హామీలపై ఆరా తీస్తున్నట్లు చెబుతున్నారు. జంపింగ్ ఎమ్మెల్యేలపై వేటు వేయడమే టార్గెట్‌గా పెట్టుకున్న బీఆర్ఎస్‌... పార్టీ అధినేత రంగంలోకి దిగిన తర్వాత అనర్హత వేటు ప్రక్రియను మరింత వేగవంతం చేసేలా పావులు కదుపుతోందంటున్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఎక్కువగా ఫాంహౌస్‌లో ఉంటున్న మాజీ సీఎం కేసీఆర్... తనను కలిసేందుకు వచ్చిన కార్యకర్తలు, నాయకులకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పరిస్థితులను తెలుసుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ వ్యతిరేకత పెరుగుతోందని తాజాగా అంచనాకు వచ్చిన కేసీఆర్... స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి పునర్ వైభవం తెచ్చేందుకు ఇప్పటి నుంచే తగిన కార్యాచరణకు సిద్ధమవుతున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం రైతు రుణమాఫీపై అసంతృప్తి ఎక్కువగా ఉన్నట్లు బీఆర్ఎస్ అంచనా వేస్తోంది.రకరకాల నిబంధనలు విధించడం వల్ల.. 30 వేల కోట్లకు పైగా అవుతుందని అంచనా వేసిన రైతు రుణమాఫీ కేవలం 17 వేల కోట్లతో సరిపెట్టిందని ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఆరోపణలు గుప్పిస్తోంది. ఈ విషయమై కృష్ణార్జునులు హరీశ్ రావు, కేటీఆర్ ఇప్పటికే ఫైట్ చేస్తున్నారు. ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేసి, ప్రభుత్వాన్ని ఒత్తిడికి గురిచేయాలని భావిస్తోంది బీఆర్ఎస్. ఇందుకోసం నేరుగా అధినేత రంగంలోకి దిగితే స్థానిక ఎన్నికల్లో అడ్వాంటేజ్ అయ్యే అవకాశం ఉందని ఊహిస్తోంది. కేసీఆర్ కూడా తగిన సమయం వరకు వేచి చూద్దామని ఇన్నాళ్లు ఆగారని.. ఇప్పుడు సమయం ఆసన్నమైనందున సమర శంఖం పూరించాలని డిసైడ్ అయినట్లు చెబుతున్నారు. వినాయక చవితి తర్వాత ఎప్పుడైనా, రైతు యాత్రలు ప్రారంభించేలా ప్లాన్ చేయాలని పార్టీ యంత్రాంగాన్ని ఆదేశించినట్లు చెబుతున్నారు.

## బెయిల్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్

అరెస్టు చేశారని ఆరోపించారు. కేజ్రీవాల్ అరెస్ట్ ఒకరకంగా ఇన్సురెన్స్ అరెస్ట్ అని ఆరోపించారు.సీబీఐ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వడాన్ని వ్యతిరేకించారు. బెయిల్ కోసం మొదట ట్రయల్ కోర్టుకు వెళ్లాలని.. నేరుగా సుప్రీంకోర్టులో అప్పీల్ చేయడంపై అభ్యంతరం తెలిపారు. సీఎం ప్రత్యేకమైన వ్యక్తి అని.. అందుకు భిన్నమైన పద్ధతిని అవలంభిస్తున్నట్లు కనిపిస్తోందని ఏసీజీ పేర్కొన్నారు. అరవింద్ కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. సీబీఐ అరెస్టును సవాల్ చేయడంతో పాటు రెండో పిటిషన్‌లో బెయిల్ కోసం అప్పీల్ చేశారు. ఇంతకు ముందు ఆగస్టు 5న ఢిల్లీ హైకోర్టు కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. ట్రయల్ కోర్టుకు వెళ్లాల్సిందిగా కోరింది. హైకోర్టులో కేజ్రీవాల్ బెయిల్‌ను వ్యతిరేకిస్తూ బెయిల్‌పై బయటకు వస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని వాదించింది.

# బోరుమంటున్న బెజవాడ

✍ జయభేరి, విజయవాడ, సెప్టెంబర్ 5:

అవును విజయవాడకు వచ్చిన కష్టం మామూలుది కాదు. వాణిజ్య రాజధానిగా ఉన్న విజయవాడ గత నాలుగు రోజుల నుంచి వ్యాపారాలన్నీ కోల్పోయాయి. ఒకటి కాదు రెండు కాదు.. వందల కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది. నష్టం అంచనా వేయడానికి కూడా కూడా అవకాశం లేకుండా పోయింది. నాలుగు రోజుల నుంచి పడిన భారీ వర్షాలు...ప్రకాశం బ్యారేజీ నుంచి పదకొండు లక్షల క్యూసెక్కుల నీరు ఒక్కసారిగా విడుదల కావడంతో విజయవాడ సగం మునిగిపోయింది. మునగడం అంటే మామూలుగా కాదు... నీళ్లలోకి నీరు చేరింది. మొదటి అంతస్తులోకి కూడా నీరు వచ్చిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో చెప్పకనే తెలుస్తుంది. విజయవాడ అంటేనే ముందుగానే గుర్తుకు వచ్చేది లారీలు. లారీలు, బస్సులు ఎక్కువగా తిరుగుతుంటాయి. ఈ బిజినెస్ పూర్తిగా పడిపోయింది. లారీలు సరుకులను తీసుకుని ఇతర రాష్ట్రాలకు వెళ్లి వస్తుంటాయి. కొన్ని వేల సంఖ్యలో లారీలు నాలుగు రోజులు స్టాండ్ లలోనే ఉన్నాయి. దీంతో తమకు తీవ్రస్థాయిలో నష్టం వాటిల్లిందని లారీ యజమానుల సంఘం చెబుతుంది. ఒక్క లారీ కూడా కదలలేని పరిస్థితి. రహదారులన్నీ జలమయం కావడంతో పాటు జాతీయ రహదారులపైకి కూడా నీరు చేరడం, అనేక చోట్ల గండ్లు పడటంతో లారీలన్నీ నిలిచిపోయి తమకు లక్షల రూపాయల్లో నష్టం తెచ్చిపెట్టిందని, దీనిని పూడ్చేదెవరని వారు ప్రశ్నిస్తున్నారు. ఇక ప్రయివేటు బస్సులు కూడా అంతే. ప్రయివేటు బస్సు సంస్థలు విజయవాడ కేంద్రంగా ఎక్కువగా తిరుగుతున్నాయి. ట్రావెల్స్ సంస్థలు అన్నీ నాలుగు రోజులు మూతపడ్డాయి. ఇతర రాష్ట్రాలకు వెళ్లే బస్సులు పూర్తిగా నిలిచిపోవడంతో తమకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని చెబుతున్నారు. ఇక కాళేశ్వరరావు మార్కెట్ కోస్తాంధ్రలోనే అతి పెద్ద మార్కెట్. హోల్ సేల్ వ్యాపారాలున్నాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి చిరు వ్యాపారులు వచ్చి ఇక్కడ కొనుగోలు చేసుకుని వెళుతుంటారు. కానీ ఆ మార్కెట్ పూర్తిగా నాలుగు రోజుల నుంచి మూతపడిపోయింది. వ్యాపార సంస్థలు గేట్లుకూడా తెరవడం లేదు. ఈ నష్టం కోట్లలో ఉంటుందని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. విజయవాడ ఫుడ్ బిజినెస్ కు ఫేమస్. పర్యాటకులతో పాటు ప్రతి రోజూ విజయవాడకు వచ్చే వారితో హోటళ్లన్నీ కళకళలాడుతుంటాయి. కానీ భారీ వర్షాలు, వరదలతో ఈ బిజినెస్ కూడా పూర్తిగా దెబ్బతినింది. దాదాపు ప్రతి హోటల్ లో ఇదే పరిస్థితి. కనీసం పట్టుమని పది మంది కూడా హోటల్ కు వచ్చి భోజనం చేయలేదని వారు చెబుతున్నారు. ఇక లాడ్జీలు మాత్రం కొంత నిండిపోయాయి. విల్లాల్లోకి, పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లలోకి వరద నీరు రావడం, విద్యుత్ సౌకర్యం లేకపోవడం, మంచి నీటి సౌకర్యం కూడా లేకపోవడంతో విజయవాడకు చెందిన సంపన్నులు మాత్రం లాడ్జిలకు వచ్చి తలదాచుకున్నారు. నేడు నీరు తగ్గడంతో వారి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. మొత్తం మీద బెజవాడలో వ్యాపారాలు దారుణంగా దెబ్బతిన్నాయి.



**నాలుగు రోజుల నరకం**

ఎన్నడూ చూడని బాధలను గత నాలుగు రోజుల నుంచి విజయవాడ ప్రజలు చూశారు. ఒకరకంగా నరకాన్ని అనుభవించారు. తినడానికి తిండి లేదు. తాగడానికి నీరు లేదు. అంత వరదలోనూ వర్షం కురవాలని కోరుకున్నవారు అధికంగా ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఎందుకంటే వర్షపు నీటితోనైనా తమ గొంతులను తడుపుకుందామన్న భావన వారిలో కలిగింది. బాధితులు ఇప్పుడు బయటకు వచ్చి తాము పడ్డ బాధలు చెబుతుంటే కన్నీరు ఆగడం లేదు. అందుకే బెజవాడను వదలి వెళ్లిపోతున్నామని చెబుతున్నారు. మరోవైపు చిన్న పిల్లలు పాల కోసం ఏడుస్తున్నారు. వారిని ఓదార్చడం ఎవరి వల్ల కావడం లేదు.మానవ తప్పిదమే కాదు. ఎందుకంటే విజయవాడలో ఇంత స్థాయిలో ఎప్పుడూ భారీ వర్షాలు పడలేదు. అయితే ప్రభుత్వం కూడా సరైన సమయంలో ప్రజలను అప్రమత్తం చేయకపోవడం కూడా ఒక తప్పుగానే చూడాలి. మరో వైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి కింది స్థాయి ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకూ కష్టపడ్డారు. వారిని ఓదార్చేందుకు ప్రయత్నించారు. భరోసా కల్పించడంలో సక్సెస్ అయ్యారు.

అయితే కొన్ని ప్రాంతాలకు ఆహార పదార్థాలను, మంచినీటిని, పాలను అందించలేకపోయారు. ఇందుకు అధికారుల తప్పిదమో, ప్రభుత్వ వైఫల్యమో అని చెప్పలేం.ఎందుకంటే అధికారంలో ఎవరున్నా ఇదే పరిస్థితి ఉంటుంది. అలాగే అధికారుల్లో కూడా అంతే. ప్రభుత్వాలతో పనిలేదు. వారి విధి నిర్వహణలో భాగంగా తమకు అప్పగించిన డ్యూటీని చేస్తారు. కానిస్టేబుల్ నుంచి రెవెన్యూ ఉద్యోగి వరకూ ఎవరైనా బాధితులకు సాయం చేయాలనే ఉంటుంది. కానీ సహకరించని పరిస్థితులు ఉంటాయి. బుడమేరు పొంగి కొన్ని ప్రాంతాలకు బోట్లు కూడా వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపు ఎనిమిది అడుగుల నీరు రావడంతో శివారు ప్రాంతాలకు ఆహార పదార్థాలను చేరవేయలేకపోయారు. అందుకు కారణం మొదటి రోజు బోట్లు అందుబాటులో లేకపోవడం. రెండో రోజు మర బోట్లు వచ్చినా అవి అన్ని ప్రాంతాలకు చేరుకోలేకపోవడంతో ఫుడ్ మెటీరియల్ ను చేర్చలేకపోయామని చెబుతున్నారు. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. బాధితుల సంఖ్య. ఇది మూడున్నర లక్షల మంది. మూడున్నర లక్షల మందికి ప్రతి రోజూ ఆహార పదార్థాలను, తాగేందుకు నీటిని అందించాలంటే మానవ సాధ్యం కాదు. అందరినీ ఒక చోట చేర్చగలిగితే వారికి భోజనం అందించవచ్చు. కానీ వారి ఇళ్లకు వెళ్లి అందించాలంటే అది ఎవరివల్లా కాదని ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి వ్యాఖ్యానించడం పరిస్థితికి అద్దం పడుతుంది. ఇప్పుడు బెజవాడ తేరుకుంటుంది. మరోసారి భారీవర్షాలు పడతాయని హెచ్చరించడంతో ఇళ్లను వదిలేసి గుంటూరు పరిసర గ్రామాలకు వెళ్లి తలదాచుకుందామని లక్షల మంది బెజవాడను ఖాళీ చేసి వెళుతున్న దృశ్యాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. భారీ వరదలు కన్నీటిని కుటుంబాలకు మిగిల్చింది. నష్టం ఎంత జరిగిందన్నది మాత్రం అంచనాకు కూడా అందడం లేదు.

## భారత్ లో సింగపూర్ భారీగా పెట్టుబడులు

కూడా పాల్గొన్నారు.ఆ తర్వాత సింగపూర్ పార్లమెంట్‌కు చేరుకున్న ప్రధాని మోదీ అక్కడ సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్, ఇతర ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సమయంలో, సెమీకండక్టర్లకు సంబంధించిన ప్రధాన ఒప్పందంతో సహా రెండు దేశాల మధ్య అనేక ముఖ్యమైన ఒప్పందాలు జరిగాయి. డిజిటల్ టెక్నాలజీ, హెల్త్, ఎడ్యుకేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ రంగాల్లో భారత్, సింగపూర్ మధ్య ఒప్పందాలు కూడా కుదిరాయి. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, లారెన్స్ వాంగ్ నాయకత్వంలో సింగపూర్ మరింత వేగంగా పురోగమిస్తుందని కొనియాడారు. సింగపూర్ ఒక దేశం మాత్రమే కాదు, అభివృద్ధి చెందుతున్న ప్రతి దేశానికి సింగపూర్ స్ఫూర్తి. భారతదేశంలో కూడా అనేక సింగపూర్‌లను సృష్టించాలనుకుంటున్నామన్నారు ప్రధాని మోదీ. ఈ దిశలో రెండు దేశాలు కలిసి పని చేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు.భారతదేశంసింగపూర్ ద్వైపాక్షిక సంబంధాల 60వ వార్షికోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ ఈ పర్యటన జరుగుతోంది, ఇది రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులను మరింత బలోపేతం చేయడానికి ఉద్దేశించింది. ఈ పర్యటనలో ప్రధాని మోదీ సింగపూర్‌లోని వ్యాపారవేత్తలు, పెద్ద కంపెనీల సీఈవోలతో సమావేశమయ్యారు. దక్షిణ చైనా సముద్రం, మయన్మార్ వంటి ప్రాంతీయ అంశాలపై చర్చించారు. సింగపూర్ ASEAN దేశాలలో భారతదేశం అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. ప్రపంచంలో భారతదేశం ఆరవ అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. సింగపూర్ భారతదేశానికి ఎఫ్‌డిఐకి ప్రధాన వనరుగా ఉంది. సెమీకండక్టర్ రంగంలో 20 సంవత్సరాల కంటే ఎక్కువ అనుభవం ఉంది.భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు తమ నిబద్ధతను తెలియజేసేందుకు అనేక ప్రముఖ సింగపూర్ కంపెనీలకు చెందిన టాప్ సీఈవోలు ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో బ్లాక్‌స్టోన్ సింగపూర్, టెమాసెక్ హోల్డింగ్స్, సెంబ్‌కార్ప్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, క్యాపిటా ల్యాండ్ ఇన్వెస్ట్‌మెంట్, ST టెలిమీడియా గ్లోబల్ డేటా సెంటర్స్, సింగపూర్ ఎయిర్‌లైన్స్ మరియు ఇతర ప్రముఖ కంపెనీలకు చెందిన నాయకులు ఉన్నారు. చర్చల సందర్భంగా, తమ ఆర్థిక సహకారాన్ని పెంపొందించడానికి, భారతదేశంలోని విభిన్న రంగాలలో పెట్టుబడులు పెట్టడానికి తమ నిబద్ధతను స్పష్టం చేశారు. ప్రముఖ పెట్టుబడి గమ్యస్థానంగా భారతదేశంను ఎంచుకుంటున్నట్లు అయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. ద్వైపాక్షిక వాణిజ్యం, ఆర్థిక వృద్ధిని పెంచడానికి చేపట్టిన వ్యూహాత్మక కార్యక్రమాలపై చర్చించారు.ఈ హైప్రొఫైల్ సింగపూర్ సంస్థల నిబద్ధత భారతదేశ ఆర్థిక వృద్ధికి గణనీయంగా దోహదపడుతుందని భావిస్తున్నారు. పెట్టుబడి రంగాలలో మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్ నుండి డేటా సెంటర్లు, విమానయానం వరకు అనేక రకాల రంగాల ప్రతినిధులతో ప్రధాని మోదీ చర్చలు జరిపారు.

## రామోజీ సిటీలోకి బుల్డోజర్లు వెళ్తాయా

పడగొట్టింది. నిర్మాణంలో ఉన్న కట్టడాలను నేల కూల్చింది. భవిష్యత్తులోనూ చెరువులను, కుంటలు, నాలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తోంది. సాక్షాత్తు దీనిని ముఖ్యమంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో హైడ్రా దూకుడును అడ్డుకునేవారు కనిపించడం లేదు. పైగా దీనిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సరికొత్త విజ్ఞప్తులు హైడ్రా ముందుకు వస్తున్నాయి. హైదరాబాద్ నగర పరిధిలోని కబ్జాకు గురైన చెరువులు, నాయకులు నిబంధనలను అతిక్రమించి చేపట్టిన నిర్మాణాల వివరాలను హైడ్రా దృష్టికి పలువురు తీసుకొస్తున్నారు. ఇందులో ఎక్కువగా బడా బాబులకు చెందిన నిర్మాణాలే ఉన్నాయి. అయితే వాటిపై హైడ్రా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నదేది ఆసక్తికరంగా మారింది. ఇదే సమయంలో హైదరాబాద్ నగరానికి మణిహారంగా మారిన రామోజీ ఫిలిం సిటీపై తెరపైకి సరికొత్త ఆరోపణలు వస్తున్నాయి.రామోజీ ఫిలిం సిటీపై ఆరోపణలు కొత్త కాదు. అసైన్డ్ భూములు ఆక్రమించి ఫిలిం సిటీని నిర్మించారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో కొంతమంది పేదలకు ఆ భూములను పంపిణీ కూడా చేశారు. వీటిపై అప్పట్లో శంకర్రావు, గోనె ప్రకాష్ రావు వంటి వారు కోర్టులను ఆశ్రయించారు. రామోజీ ఫిలిం సిటీ విస్తరించిన ప్రాంతంలో చెరువులు ఉన్నాయట. రామోజీరావు నివసించిన భవనం పక్కనే అతిపెద్ద నాలా ఉందట. దానిని ఆక్రమించి భారీ నిర్మాణం చేపట్టారట. ఈ విషయాన్ని ఓ యూట్యూబ్ ఛానల్ నిర్వహించిన ముఖాముఖిలో ఓ సామాజికవేత్త బయటపెట్టారు. తెలంగాణ హైడ్రాకు చిత్తశుద్ధి ఉంటే ఆ నిర్మాణాలను కూడా పడగొట్టాలని ఆయన డిమాండ్ చేశారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతమైన వ్యాప్తిలో ఉంది. ఈ వీడియో ప్రసారమవుతుండగానే రామోజీ ఫిలిం సిటీలో ఉన్న చెరువులను చూపిస్తుండడం విశేషం. మరి దీనిపై తెలంగాణ హైడ్రా ఎటువంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సి ఉంది. మరోవైపు తెలంగాణ హైడ్రా చేస్తున్న పనులను ఈనాడు అభినందిస్తోంది. హైదరాబాద్ నగరాన్ని ఆక్రమణలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరుతోంది. మరి ఇదే స్ఫూర్తిని తన ఫిలిం సిటీ లోని చెరువులను పరిరక్షించేందుకు ప్రయోగించాలని కోరుతుందా? హైడ్రా తీసుకునే చర్యలకు సమ్మతం తెలుపుతుందా? అనే ప్రశ్నలకు సమాధానం లభించాల్సి ఉంది.



# మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బ

✍ జయభేరి, వరంగల్, సెప్టెంబర్ 5:

ఛత్తీస్ గఢ్‌లో మావోయిస్టుల కదలికలపై పోలీసులు నిఘా పెట్టారు. ఇటీవల దంతెవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్‌లో తొమ్మిది మంది మావోయిస్టులు మృతిచెందారు. అయితే వీరిలో మావోయిస్టు అగ్రనేత మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ @దాదా రణదేవ్ దాదా ఉన్నారు. కేంద్ర మిలిటరీ ఇన్చార్జ్, మహారాష్ట్ర, ఛత్తీస్ గఢ్ బార్డర్ ఇంచార్జ్ గా వ్యవహరించిన ఏసోబు అలియాస్ జగన్ మృతిచెందినట్టు దంతేవాడ పోలీసులు ప్రకటించారు. మావోయిస్టు అగ్రనేత ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందినవాడు కావడంతో అక్కడ విషాద ఛాయలు అలుముకున్నాయి. అగ్రనేత స్వగ్రామం కాజీపేట మండలం టేకులగూడెం అని, ఇటీవల జరిగిన భారీ ఎన్ కౌంటర్ లో జగన్ కూడా చనిపోయాడని దంతేవాడ ఎస్పీ తాజాగా ప్రకటించారు.

ఛత్తీస్ గఢ్‌లో ఆపరేషన్ మావోయిస్టుల లక్ష్యంగా బలగాలు కూంబింగ్ ను కొనసాగిస్తున్నాయి. భారీ వర్షాల సమయంలో మావోయిస్టులను ప్రాంతాలు మారుతున్నారు. ఈ క్రమంలో పోలీస్ బలగాల కూంబింగ్ కొనసాగించారు. రెండు రోజుల కిందట ఉదయం జరిగిన ఎన్ కౌంటర్ తొమ్మిది మంది మావోయిస్టులు చనిపోయినట్టు దంతేవాడ పోలీసులు ధృవీకరించారు. ఛత్తీస్ గఢక్ రాష్ట్రంలోని దంతెవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దు అటవీ ప్రాంతంలో మావోయిస్టుల కార్యకలాపాలు కొనసాగుతున్నట్లు సమాచారం అందింది. దాంతో అప్రమత్తమైన పోలీస్ బలగాలు దంతెవాడ, బీజాపూర్ ప్రాంతంలోని అడవులను జల్లెడ పట్టారు. ఈ క్రమంలో పోలీస్ బలగాలకు మావోయిస్టులకు జరిగిన ఎదురు కాల్పుల్లో తొమ్మిది మంది మావోయిస్టులు చనిపోయినట్టు దంతెవాడ పోలీసులు ధృవీకరించారు. ఎన్ కౌంటర్ జరిగిన ప్రదేశంలో భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకొని, అనంతరం సైతం కూంబింగ్ కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల వివరాలు, వారిపై రివార్డ్ ఎంతంటే..

1. రణదేవ్ (మాచర్ల ఏసోబు అలియాస్ జగన్) వరంగల్ నివాసిపై రివార్డు రూ.25 లక్షలు
2. సుశీల మడకం, భర్త జగదీష్.. రివార్డు రూ.5 లక్షలు
3. కుమారి శాంతి, పోస్ట్ 31 PL సభ్యులు. రివార్డు రూ.5 లక్షలు
4. కోసా మాద్వి, హోదా మలంగిర్. ఏరియా కమిటీ పార్టీ సభ్యుడు రివార్డు రూ.5 లక్షలు.
5. గంగి ముచకి, హోదా కాటేకల్యాణ్ ఏరియా కమిటీ సభ్యుడు రివార్డురూ.5 లక్షలు.
6. లలిత, పోస్ట్ సురక్షా దళ్ సభ్యుడు, రివార్డు రూ.5 లక్షలు.
7. కవిత, పోస్ట్ గార్డ్ ఆఫ్ AOBSZCగా ఉన్నారు, ఆమెపై రివార్డు రూ.5 లక్షలు.
8. కమలేష్. ప్లాటూన్ మెంబర్ బీజాపూర్ నివాసి, రివార్డ్ రూ. 2లక్షల
9. హిడ్మే మంకం, సురక్షా దళ్ సభ్యుడు, రివార్డు రూ.2 లక్షలు

# వినాయక చవితి వేడుకలకు అన్ని ఏర్పాటు పూర్తి

జయభేరి, ఉప్పల్ :

వినాయక చవితి నిమర్జన ఏర్పాట్ల కోసం కాప్రా, చర్లపల్లి, ఉప్పల్ నల్ల చెరువులను పరిశీలించిన GHMC మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ZC హేమంత్ పాటిల్. కాప్రా చెరువులను పరిశీలించి వినాయక నిమర్జననానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలని అధికారులను అప్రమత్తం చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. వినాయక చవితి వేడుకలకు అన్ని ఏర్పాటు పూర్తి చేశామని ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలని ఆయన తెలిపారు. చెరువుల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా DC జగన్, ఉప్పల్ డీసీ ఆంజనేయులు, ఏసిపి, CI, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ మాజీ అధ్యక్షులు, మాజీ ప్రధాన కార్యదర్శిలు, BRS పార్టీ నాయకులు, కార్యకర్తలు, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





## పేదింటి ఆడపడుచులకు ఎంతో ఉపయోగం

జయభేరి, ఉప్పల్ :

మల్లాపూర్ వివిఎన్ఆర్ గార్డెన్స్ లో ఉప్పల్ మండలానికి చెందిన 443 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ పథకం చెక్ లను అందజేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఉప్పల్ మండలానికి చెందిన 443 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ పథకం చెక్ లను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదిముబారక్ పథకం పేదింటి ఆడపడుచుల పెళ్ళిళ్ళకి ఎంతో ఉపయోగపడుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన విధంగా తులం బంగారం కూడా ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మార్వో వాణి రెడ్డి, డిప్యూటీ ఎమ్మార్వో సునీల్, కార్పొరేటర్లు శాంతి శైజెన్ శేఖర్, పన్నాల దేవేందర్ రెడ్డి, బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్, రజిత పరమేశ్వర్ రెడ్డి, కక్కిరేణి చేతన హరీష్‌రావు, బండారు శ్రీవాణి వెంకట్ రావు, లబ్దిదారులు, స్థానిక నాయకులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.




ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పీర్జాదిగూడ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ బొడిగె స్వాతి కృష్ణ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులను కలిసి సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం పథకాలపై, అంటూ వ్యాధుల నివారణ పై కళాకారులచే అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మహిళలు, RPలు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జయభేరి, మేడిపల్లి

## ఉత్తమ ఉపాధ్యాయురాలకు సన్మానం




జయభేరి, మేడిపల్లి :

ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా మేడిపల్లి కమలానగర్ ప్రాథమిక పాఠశాల ఉత్తమ ఉపాధ్యాయురాలకు సన్మాన కార్యక్రమం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ కమలానగర్ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకొని మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎన్నికైన మాధవికి సన్మానం చేసి కేకు కట్ చేసి ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిజేశారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ అనంతరెడ్డి, సీనియర్ నాయకులు పప్పుల అంజి రెడ్డి, తుముకుంట్ల శ్రీధర్ రెడ్డి, బొడిగె కృష్ణాగౌడ్, చింతల నర్సింహ రెడ్డి, బోటుమంచి సునీల్, సుక్క జైహిందర్, కాటపాక కుమార్, ప్రభాకర్ గౌడ్, 1వ వార్డు నాయకులు తవిటి ప్రశాంత్, కాటపాక భారత్, మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకులనే ప్రతిష్టించాలి




జయభేరి, ఘట్కేసర్ :

ఆదిలీల ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీవాణి చందేల్ ఆధ్వర్యంలో గురువారం ఘట్కేసర్ లోని ఎన్ ఎఫ్ సి నగర్ లో 100 మందికి ఉచితంగా మట్టి వినాయకులను ముల్లి పావని జంగయ్య యాదవ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఘట్కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, స్థానిక కౌన్సిలర్ కొమ్మగోని రమాదేవి మైపాల్ గౌడ్, కౌన్సిలర్ సల్లూరి నాగ జ్యోతిలు ముఖ్య అతిథిగా విచ్చేసి ఉచిత మట్టి గణేషుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ముల్లి పావని జంగయ్య యాదవ్, మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మట్టి వినాయకులు వాడి పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని ప్రజతో పాటు పర్యావరణాన్ని రక్షించుకునే భాద్యత అందరిపై ఉందన్నారు.మట్టి వినాయకులనే మాత్రమే పూజించాలన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకు పోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాదవ్, ఎన్ఎఫ్ సి నగర్ వార్డు నెంబర్ 2 అధ్యక్షులు యాదగిరిరావు, ఎన్ ఎఫ్ సి నగర్ మహిళా నాయకురాలు మమతా శర్మ, ఆదిలీల ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి నల్ల నాగేంద్రరావు, భబితారాణి, గజానంద్, బాల్రెడ్డి, నల్ల శివ తదితరులు పాల్గొన్నారు.



## ముంపు గురైన ప్రాంతాలకు మినరల్ వాటర్

జయభేరి, కైకలూరు:

ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం కైకలూరు మండలం కైకలూరులో వర్షాలు కురిసి ముంపుకు గురైన వెలమపేట కాలనీలో ప్రజలు త్రాగటానికి స్వచ్ఛమైన నీరు (మినరల్ వాటర్) ని కైకలూరు ప్రముఖులు గుర్రం శ్యామ్, గొల్లు బాబి సారధ్యంలో పంపిణీ చేసి వారికి కృతజ్ఞతలు తెలిపిన తెలుగుదేశం పార్టీ నాయకులు వీరాబత్తిన సుధ, బిజేపి నాయకులు కండుబోతు నాగరాజు, సింహచలం తదితరులు పాల్గొన్నారు.

## ఫైర్ కానిస్టేబుల్ సేవలు అభినందనీయం



జయభేరి, కైకలూరు :

కలిదిండి మండలం సాన రుద్రవరానికి చెందిన మట్లపూడి రంగారావు వైజాగ్ స్టీల్ ప్లాంట్ లో ఫైర్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్నారు సెలవు పై తన స్వగ్రామానికి వచ్చారు. తను వెళుతున్న దారిలో ఒక వృద్ధుడు వెంకటేశ్వరరావు సుమారు (60) సంవత్సరాలు పచ్చగడ్డి కోస్తూ సురతప్పి పడిపోయాడు. అటుగా వెళుతున్న ఫైర్ కానిస్టేబుల్ చూసి తన వద్ద ఉన్న సి పి ఆర్ ఆక్సిజన్ చేసి ప్రాణాలు కాపాడాడు వెంటనే 108 సిబ్బందికి ఫోన్ చేసి సకాలంలోస్పందించి హాస్పిటల్ కి తరలించి వైద్యం చేసి వైద్యులు ప్రాణాలను కాపాడారు.. ముంపుకు,గురైన వరద బాధితులకు ఆర్వో వాటర్ ట్యాంకర్ కొంత ఫుడ్ ఐటమ్స్ విజయవాడ బాధితులకు అందజేశారు. మండల ప్రజలు అభినందించారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ




జయభేరి, కైకలూరు :

కలిదిండి ఇటీవల కాలంలో ముంపు గురైన వరద బాధితులకు రాధా రంగ మిత్ర మండల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విజయవాడకు నిత్యావసర సరుకులు ఆర్ వో వాటర్ ట్యాంకర్లు సుమారు 40 వేల రూపాయలు విలువచేసే ఫుడ్ ఐటమ్స్ వరద ముంపు గురైన బాధితులకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర తెలంగాణ రాధారంగ మిత్ర మండలి ట్రస్టు అధ్యక్షులు పన్నాస పూర్ణచంద్రరావు (కాళ్ల పాలెం బుజ్జి) చిట్టూరి రవీంద్ర, నల్లగోపుల చలపతి, మట్లపూడి రంగారావు, బుడ్డి సుభాషిని, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## రెండవ రోజు కొనసాగుతున్న శాంతియుత నిరసనలు

- రెగ్యులర్ వీ, స్టాఫ్ కావాలంటూ త్రిబుల్ ఐటీ బాసర విద్యార్థుల నిరసనలు
- రెగ్యులర్ వీసి, రిజిస్టర్, డైరెక్టర్, స్టాఫ్ లేక ఫెలైతున్న విద్యార్థులు!
- సీఎం రేవంత్ రెడ్డి మాపై దయ చూపాలంటూ వేడుకోలు!

జయభేరి, నిర్మల్ :




ఇంత టెక్నాలజీ ఉన్నటువంటి ఈ భారత దేశ సమాజంలో బంగారు తెలంగాణ రాష్ట్రంలో చదువు కోసం.. తిండి కోసం.. అధ్యాపకుల కోసం అడుక్కోవలసిన పరిస్థితి నిర్మల్ జిల్లా ముదోల్ నియోజక వర్గం బాసర సరస్వతి అమ్మవారి త్రిబుల్ ఐటీ యూనివర్సిటీలో నెలకొంది. వివరాల్లోకి వెళితే.. గత కొన్ని సంవత్సరాల క్రితం అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి నిరుపేద గ్రామీణ ప్రాంతాల ప్రభుత్వ విద్యార్థినీ విద్యార్థుల కోసం ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ త్రిబుల్ ఐటీ బాసర యూనివర్సిటీని స్థాపించారు. ఆయన ఉన్నన్ని రోజులు కొన్ని సంవత్సరాలపాటు దేశంలోనే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా విద్యార్థినీ విద్యార్థులు తయారయ్యారు. కానీ పోయిన టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 10 సంవత్సరాలు విద్యార్థినీ, విద్యార్థులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా చూసుకున్నట్లయితే ఇంటర్ ప్రథమ ద్వితీయ విద్యార్థినీ విద్యార్థుల నివాసం కోసం 15 సంవత్సరాల క్రితం ఏర్పాటుచేసిన రేకుల షెడ్లు అతి ప్రమాదకరంగా విద్యార్థుల ఆవాసం ఉండేవని, అప్పటి పేరెంట్స్ కమిటీ పోరాటాల మేరకు అక్కడి నుండి విద్యార్థులను పక్కా బిల్డింగ్ లోకి మార్చడం జరిగిందని, అన్నం, కూరల్లో బల్లులు, పురుగులు, కప్పలు వచ్చిన విషయం ఈ ప్రపంచానికి తెలుసు. చదువుకోవడానికి ఆరకొర వసతులు, రెగ్యులర్ వైస్ ఛాన్స్ లార్, డైరెక్టర్, రిజిస్టర్ ఉండరు, రెగ్యులర్ ప్రొఫెసర్స్ ఉండరు.. మరి చదువుకునేది ఎలా అంటే దాదాపు 9 వేల మంది విద్యార్థిని విద్యార్థులకు కేవలం 9 మంది కూడా రెగ్యులర్ స్టాఫ్ లేక సుమారుగా 200 నుంచి 300 మంది ప్రైవేట్ అధ్యాపకులతో తో గత కొన్ని సంవత్సరాలుగా యూనివర్సిటీని నడిపించుకుంటూ ముందుకు తీసుకెళ్తున్నారు. దాని ఫలితంగా పిల్లలు క్వాలిఫైడ్ స్టాఫ్ లేక ఎన్నో సబ్జెక్ట్స్ ఫెయిలవుతూ.. అతి కష్టంగా యూట్యూబ్లో లెసన్స్ వింటూ అతి కష్టం మీద పిల్లలు చదువును కష్టకాలంగా ముందుకు కొనసాగిస్తున్నారు. 2023 సంవత్సరంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో వారం రోజులపాటు విద్యార్థిని విద్యార్థులు ఎండనక వాననక శాంతియుత నిరసనలు చేసి యావత్ ప్రపంచం వారెవా అనేటట్లు శాంతియుత నిరసనలు చేశారు. అప్పుడు ఉన్నటువంటి మంత్రులు వెళ్లి మూడు నెలల్లో మీకు అన్ని వసతులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి, అసెంబ్లీలో వదంతులు చెప్పి, సమయపాలన చేశారు. చివరికి ఆ ప్రభుత్వం పోయి మళ్ళీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చింది, సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఆరోజు ప్రతిపక్ష నేతగా ఉన్నటువంటి ఇప్పటి సీఎం రేవంత్ రెడ్డి ఆరోజు ఎడ్ల బండి మీద విద్యార్థిని విద్యార్థులను కలిసి, అప్పటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కానీ ఇప్పుడు ఆయన ముఖ్యమంత్రి అయ్యి తొమ్మిది నెలలు గావస్తున్న ఎందుకు రెగ్యులర్ వీసి, రిజిస్టర్, డైరెక్టర్, స్టాఫ్ ఏర్పాటు చేయలేకపోతున్నారని పిల్లలు ,తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు +ఎస్ జి సి) స్టూడెంట్ గవర్నింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా సాయంత్రం గంటపాటు శాంతియుత నిరసనలు తెలియజేస్తూ.. వి వాంట్ జస్టిస్.. వి వాంట్ రెగ్యులర్ వీసి అండ్ స్టాఫ్ అంటూ నినాదాలు చేసుకుంటూ యూనివర్సిటీ చుట్టూ తిరుగుతున్నారు. అయినప్పటికీ ఆ విద్యార్థిని విద్యార్థుల ఘోస ఈ ప్రభుత్వ ఉద్యోగులకు గాని ప్రభుత్వానికి గాని పట్టడం లేదు. కాబట్టి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి మండలి,నిర్మల్ జిల్లా కలెక్టర్, డి ఈ ఓ, స్థానిక ఎమ్మెల్యే తదితరులు పట్టించుకొని, మా జీవితాలను బాగుపరచాలని మాకు రెగ్యులర్ వైస్ ఛాన్సలర్, రిజిస్టర్, డైరెక్టర్, అధ్యాపకులు కావాలని, వెంటనే ఏర్పాటు చేయాలని పిల్లలు కోరుతున్నారు. లేనిపక్షంలో మళ్లీ 24 గంటల ఆమరణ నిరాహార దీక్షలకు దిగుతామని (ఎస్ జిసి) స్టూడెంట్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు హెచ్చరించారు.

## గ్రామాల్లో ప్రగతి విప్లవం కొనసాగుతుంది

- సీసీ రోడ్ల నిర్మాణ పనుల శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

జయభేరి, చందంపేట :




చందంపేట మండలంలోని కోరట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కంబాల పల్లి పిడబ్ల్యుడి రోడ్డు నుండి కోరట్ల వరకు STSDF నిధుల నుంచి మంజూరు అయినా రూ.80లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనుల శంఖుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై, సీసీ రోడ్డు పనులను శంకుస్థాపన చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో గ్రామాలకు మహర్దశ వచ్చిందన్నారు. గత పాలకుల చేతుల్లో నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురైన అనేక గ్రామాలు కాంగ్రెస్ పాలనలో క్రమ క్రమంగా అభివృద్ధి చెందుతున్నాయని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో R&B శాఖ అధికారులు AEE శ్రీనివాస్, DEE భాస్కర్, EE ఖాజాన్ గౌడ్, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ DE సత్యానందం, మండల పార్టీ అధ్యక్షులు బద్య నాయక్, PACS చైర్మన్లు జాలె నరసింహ రెడ్డి, కొండ్ర శ్రీశైలం, సీనియర్ నాయకులు సిరాజ్ ఖాన్, నాయిని మాధవ రెడ్డి, మాజి ఎంపీపీ పార్వతి చందు నాయక్, మాజీ జడ్పీటీసీ బుచ్చి లచ్చరాం నాయక్, ముక్కముల్ల వెంకటయ్య, ముత్యాల సర్వయ్య, ఏడ్పుల గోవిందు, కిన్నెర హరికృష్ణ, కొర్ర రాంసింగ్ నాయక్, దొండేటి మల్లా రెడ్డి, లెంకల గోవిందు, పొలగొని వెంకన్న తదితరులు పాల్గొన్నారు.





## గురువులను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలి

**జయభేరి, మేడిపల్లి :**

వెస్ట్ బీమ్ రెడ్డి నగర్ లో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వెస్ట్ భీమ్ రెడ్డి నగర్ కల్చరల్ సొసైటీ వారు ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఐదవ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మా రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మా రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తి జీవితంలో తల్లిదండ్రుల తర్వాత గురువులే ప్రముఖ పాత్ర వహిస్తారు. మంచి చెడు చెప్పి బతుకు బండిని లాగేందుకు అవసరమైన విషయాలను బోధిస్తారు. కొన్నిసార్లు మనల్ని కొట్టి తిట్టి బుజ్జగించి పాఠాలు నేర్పిస్తారు. ఈ సమాజంలో మన పాత్ర ఏమిటో తెలియజేసి ఒక మంచి మనిషిగా మనల్ని తీర్చిదిద్దుతారు. మన బతుకు బండిని లాగేందుకు అవసరమైన విషయాలను బోధిస్తారు, అందుకే ఈ సమాజంలో వారి పట్ల ప్రత్యేకమైన గౌరవ అభిమానం ఉంటాయి. మనకు ఓనమాలు నేర్పించిన గురువులను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలి. ప్రతి వ్యక్తికి ఒక ముఖ్యమైన రోజు సత్కరించే వారి ఆశీస్సులు పొందాలి. ఈ కార్యక్రమం లో సొసైటీ అధ్యక్షులు పన్నాల బుచ్చి రెడ్డి, వెంకట చారి, చంద్రశేఖర్, కరుణాకర్, ఉపేందర్ రమేష్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఎంకెఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ ఎం కె ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలను విద్యార్థులు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమావత్ రవి ప్రసంగిస్తూ గురువులు ప్రత్యక్ష దైవాలని మహనీయుల త్యాగాలను మరువద్దని మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష జీవితం అందరికీ ఆదర్శమని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులకు ఎంటర్టైన్మెంట్ గేమ్స్ నిర్వహించడం జరిగింది అనంతరం విద్యార్థులు అధ్యాపకులందరినీ సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు అధ్యాపకేతర బృందంతో పాటు, విద్యార్థిని , విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

## కఠినంగా శిక్షించాలి

జనసేన పార్టీ నాయకులు చందు నాయక్ బంజారా సినీ హీరో



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ నియోజకవర్గం జనసేన పార్టీ సేవాలాల్ బంజారా సంఘం విద్యార్థి భాగ రాష్ట్ర అధ్యక్షుడు కోర్ర చందు నాయక్ దేవరకొండ నియోజకవర్గ సేవలాల్ బంజారా సంఘం కార్యాలయంలో ఒక ప్రకటన విడుదల చేశారు అనంతరం వారు మాట్లాడుతూ కలకతలో డాక్టర్ మౌమిత జరిగిన సంఘటన మరువకముందే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జైనూర్ మండలం,ఉస్సేగాం గ్రామానికి చెందిన గిరిజన ఆదివాసి గోండు మహిళాను అక్కడి ఒక వర్గానికి చెందిన మద్దుమ్ అనే ఉన్మాదితో పాటు మరికొంతామంది కలిసి మహిళను అత్యాచారం,అపై దాడి,హత్యాయత్నం చెయ్యడం దారుణమని అన్నారు వారికి కఠినంగా శిక్షించాల్సిందిగా కోరుతూ ఈవిషయని చొరవతీసుకొని గిరిజన మహిళకి న్యాయం చేయాలనీ ప్రభుత్వని డిమాండ్ చేశారు దేవరకొండ నియోజకవర్గం సేవాలాల్ బంజారా సంఘం ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ బంజారా సంఘం నాయకులు మంగు నాయక్ తులసిరం నాయక్ వినోద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మల్లయ్య, బత్తుల సాయిలును శాలువాలతో సత్కరించి అధ్యాపక బృందానికి అందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం నాయకులు మాట్లాడుతూ... ఉపాధ్యాయ వృత్తి అనేది ప్రపంచానికే రోల్ మోడల్ ప్రతి ఒక్కరికి శిక్షణ ఇచ్చి అత్యున్నత స్థానానికి చేర్చేది నిస్వార్థంతో చీకటిలో ఉన్నటువంటి వ్యక్తిని వెలుగులోకి నడిపించేది ఉన్నత శిఖరానికి చేరడానికి అందించే విద్యా ద్వారా గురువు ముఖ్యం నేటి సమాజంలో విద్యార్థులు అందరూ గురుతర బాధ్యత ప్రకారం చెప్పేటటువంటి సూచనలు పాటించి ఉన్నత శిఖలాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చొల్లేటి భాస్కరాచారి, గౌరోజు బ్రహ్మచారి, కామంచి అంజయ్య, మునిని సత్యం, వనం బుచ్చయ్య, ఆర్.కోటేశ్వరరావు, అంబటి సంతోష్ కుమార్, కానుగుల మోహన్ బాబు, శిరముని రాములు, కళాశాల లెక్చరర్స్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో 'గ్లోబల్ ఏఐ'

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 5:**




కొత్త ఆవిష్కరణలు ప్రజల జీవితాల్లో మార్పులు తెస్తాయని.. సరికొత్త ఆవిష్కరణలు ప్రపంచాన్ని మార్చాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'గ్లోబల్ ఏఐ' సదస్సుకు సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఐ రోడ్ మ్యాప్ ఆవిష్కరించారు. ఈ సదస్సుకు వివిధ ఐటీ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. రాబోయే రెండు, మూడేళ్లలో రాష్ట్రంలో ఏఐ అభివృద్ధికి చేపట్టే చర్యలను పేర్కొన్నారు. హైదరాబాద్‌లో జీపీయూ ఆధారిత ఏఐ క్లౌడ్ ఏర్పాటులో భాగస్వామ్యంలో సదస్సులో చర్చించారు. కొత్త ఆవిష్కరణలు ఆశలతో పాటు భయాన్ని తీసుకొస్తాయని.. విప్లవాత్మక మార్పులకు హైదరాబాద్ మాదిరిగా ఏ నగరమూ సిద్ధంగా లేదని అన్నారు. ఏఐ ద్వారా భవిష్యత్తుకు బలమైన పునాది వేశామని.. నాస్కామ్ సహకారంతో ఏఐ ఫ్రేమ్ వర్క్‌కు రూపకల్పన జరుగుతుందని చెప్పారు. ఆవిష్కరణలకు పారిశ్రామిక నిపుణులతో రాష్ట్ర ప్రభుత్వం కలిసి పనిచేస్తోందని పేర్కొన్నారు. అందరం కలిసికట్టుగా సరికొత్త భవిష్యత్తును ఆవిష్కరిద్దామని అన్నారు.'సాంకేతికత, ఆవిష్కరణ లేకుండా సమాజంలో ఏ మార్పు జరగదు. మొదటి రైలు, ఇంజిన్ ఆవిష్కరణ తరువాత ప్రపంచం పూర్తిగా మారింది. విమానం ఆవిష్కరణతో ప్రపంచ స్వరూపమే మారిపోయింది. ఇదే క్రమంలో కరెంటు, బల్బు, టీవీ, కెమెరా, కంప్యూటర్.. ఇలా ఇవన్నీ ప్రపంచ గతిని మార్చడంలో కీలక పాత్ర పోషించాయి. ఆధునిక సాంకేతికతతో ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ వాడడం మన తరం చేసుకున్న అదృష్టం. ఇవాళ ప్రపంచ సాంకేతిక రంగంలో వచ్చిన అత్యుత్తమ ఆవిష్కరణ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్. కొత్త టెక్నాలజీ వచ్చినప్పుడల్లా కొంత భయం నెలకొంటుంది. అది మన జీవితాన్ని ఎలా మెరుగుపరుస్తుంది.. అదే సమయంలో ఉద్యోగాలు పోతాయా భయం ఉండటం సహజం. దేశ చరిత్రను పరిశీలిస్తే.. గతంలో వచ్చిన పారిశ్రామిక విప్లవాన్ని సరిగ్గా అనుసరించలేకపోయాం. భారతదేశ భవిష్యత్తు గురించి ఆలోచిస్తే.. హైదరాబాద్ సిటీలా మరే సిటీ పరిశ్రమల ఏర్పాటుకు సంపూర్ణంగా సిద్ధంగా లేదు. ఇందుకు సంబంధించిన సవాళ్లను స్వీకరించడమే కాదు. భవిష్యత్తును సృష్టిస్తాం. హైదరాబాద్‌ను AI హబ్‌గా తీర్చిదిద్దబోతున్నామనేందుకు ఈ సదస్సు నిదర్శనం. సిటీ ఆఫ్ ది ఫ్యూచర్‌కి మీ అందరికి స్వాగతం.' అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఏఐలో పట్టు సాధించబోతున్నామని.. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. డీప్ ఫేక్ లాంటి ఘటనలు జరగకుండా ఏఐని సరైన దారిలో ఉపయోగించుకుంటామని.. ప్రపంచ స్థాయి యూనివర్శిటీలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నామని పేర్కొన్నారు. ఎథికల్ ఏఐ విషయంలో జపాన్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్తున్నామని అన్నారు. రాబోయే 2 రోజులు హెచ్ఐసీసీ వేదికగా ఏఐపైనా చర్చలు,స సెమినార్లు ఉంటాయని అన్నారు.

# బీద కుటుంబానికి బియ్యం నిత్యావసర సరుకుల పంపిణీ

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమాన్ నగర్ లో ఉంటున్న గుండోజు కోటయ్య కుటుంబానికి బియ్యం నిత్యవసర సరుకులు అధ్యక్షుడు ఎన్విటి ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, సభ్యులతో కలిసి పంపిణీ చేయడం జరిగినది. అనంతరం అధ్యక్షుడు ఎన్విటి మాట్లాడుతూ ఇలాంటి బీద కుటుంబాలను ఆదుకోవాలని స్వచ్ఛంద సంస్థలు వారికి చేతనైనంతవరకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కోటయ్యకు ఉన్న ఇల్లు కూడా కూలిపోవడం జరిగిందని ఇలాంటి వారిని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. ఎవరికి తోచిన సహాయం వారు చేయవలసిందిగా కోరినారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ క్రీడాకారులకు కళాకారులకు ఎప్పుడు అండగా ఉంటుందని, సమాజసేవ కార్యక్రమాలలో ఎప్పుడు ముందుంటుందని, దేవరకొండ నియోజకవర్గ ప్రజల అండ దండలు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ కి ఎప్పుడు ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కృష్ణ కిషోర్, లీగల్ అడ్వైజర్ ఉమా మహేష్, రాపోలు నిరంజన్, బత్తుల అమర్, భాస్కర్ రెడ్డి, తాళ్ల సురేష్, వైయస్ కరుణాకర్, సత్యం టీచర్, గడ్డం వెంకటయ్య, ఎల్ఐసి యాదగిరి, చంద్రశేఖర్, కరాటే మాస్టర్ శ్రీను, డాన్స్ మాస్టర్ జగన్, గణపతి, నెల్వాలపల్లి శేఖర్, రాము, శోభన్, గణేష్, రాజ్ కుమార్, శ్రీకాంత్, ప్రవీణ్, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.




## స్వర్గీయ సర్వేపల్లి రాధాకృష్ణ మాజీ రాష్ట్రపతి జయంతి

**జయభేరి, దేవరకొండ :**

స్థానిక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం దేవరకొండలో మాజీ రాష్ట్రపతి స్వర్గీయ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి జయంతి వేడుక సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల అలంకరించి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించినారు. సహా అధ్యక్షులు, జిల్లా కార్యదర్శి గంగిడి దామోదర్ రెడ్డి, కంచర్ల నారాయణ రెడ్డి భారత దేశానికి వారు చేసిన సేవలను కొనియాడినారు, ఒక ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించిన దేశానికి రాష్ట్రపతి చాలా గొప్పవిషయం అన్నారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పంగునూరు లింగయ్య, ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్, ఆడిటర్ వనం బుచ్చయ్య,కార్యవర్గం సభ్యులు జంపాల యాదగిరి, మోటమర్రి పురుషోత్తం, ప్రభాకర్, అలంపల్లి శ్రీనివాసులు తదితరులు పాలుగోన్నారు.

# బీహార్ రాజకీయాల్లో ప్రకంపనలు

**జయభేరి, పాట్నా, సెప్టెంబర్ 5:**




బీహార్ రాజకీయాల్లో మరోసారి 'పొలిటికల్ గేమ్' జరగబోతుందా? సింగపూర్ నుంచి ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్య పరీక్షలు చేయించుకుని తిరిగి రావడంతో బీహార్‌లో రాజకీయ గందరగోళం నెలకొంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, అసెంబ్లీ ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ సమావేశమయ్యారు. ఇప్పుడు రెండవ రోజు, RJD ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో లాలూ ప్రసాద్ యాదవ్ సమావేశమవుతున్నారు. ఈ పరిస్థితులన్నింటిని గమనిస్తుంటే, రాష్ట్రంలో కొత్త ప్రయోగానికి స్క్రిప్ట్ రాసుకుంటున్నట్లు కనిపిస్తోంది.ముఖ్యమంత్రి సచివాలయంలో సీఎం నితీశ్‌కుమార్, మాజీ డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ సమావేశమయ్యారు. నితీష్‌తేజస్విల ఈ వన్ టు వన్ భేటీ అకస్మాత్తుగా జరగలేదు కానీ ప్లాన్ చేసిందే అంటున్నారు పార్టీ వర్గాలు. బీహార్‌లో సమాచార కమిషనర్ నియామకంపై చర్చించేందుకు ఇరువురు నేతలు సమావేశమయ్యారు. సమాచార కమిషనర్ నియామకం కోసం ఏర్పాటు చేసిన కమిటీలో ముఖ్యమంత్రితోపాటు, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు, కేబినెట్ మంత్రి కూడా ఉన్నారు. అందుకే ఇద్దరు నేతలూ సమావేశమయ్యారు. అయితే సమాచార కమిషనర్ పేర్ల గురించి చర్చించడానికి బదులుగా, కొత్త పొలిటికల్ కెమిస్ట్రీని సృష్టించడంపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.అయితే, ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌ను కలిసిన తర్వాత తేజస్వి యాదవ్ బయటకు వచ్చినప్పుడు, అతను స్వయంగా మొత్తం పరిస్థితిని ముందుకు తీసుకువచ్చాడు. కొన్ని నియామకాలు జరగాల్సి ఉందని, దీనిపై ముఖ్యమంత్రితో చర్చించామన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం అధికారికంగా సమాచారం ఇవ్వనుంది. 65 శాతం రిజర్వేషన్లను రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చే అంశంపై సీఎంతో మాట్లాడినట్లు తేజస్వి తెలిపారు. అయితే ఈ అంశం కోర్టులో ఉందని, దీనిపై తాను కోర్టును ఆశ్రయించినట్లు తేజస్వీ తెలిపారు. ప్రభుత్వం తన అభిప్రాయాలను కోర్టులో తెలియజేయాలని, తాను కూడా తన అభిప్రాయాలను తెలియజేస్తానని అన్నారు.మరోవైపు తన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశాన్ని ఏర్పాటు చేయాలని లాలూ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. తన ఎమ్మెల్యేలతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన శాసనమండలి సభ్యులు, అభ్యర్థులను లాలూ యాదవ్ పిలిచారు. పార్టీ సంస్థాగతాన్ని బలోపేతం చేసేందుకు అందరికి పిలుపునిచ్చినట్లు ఆర్జేడీ వర్గాలు పేర్కొన్నాయి. తేజస్వీ యాదవ్ సెప్టెంబర్ 10 నుంచి బీహార్‌లో అభర్ యాత్ర ప్రారంభించనున్నారు. లాలూ యాదవ్ తన పర్యటనను విజయవంతం చేసేందుకు వ్యూహరచన చేయడం ప్రారంభించారని, అందుకే ఆర్జేడీ తన నేతలతో బుధవారం సమావేశాన్ని ఏర్పాటు చేసిందని భావిస్తున్నారు.ఒకవైపు బీహార్ సెక్రటేరియట్‌లో నితీష్, తేజస్విలు సమావేశమవుతుండగా, మరోవైపు లాలూ యాదవ్ తన నేతలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. నితీష్, తేజస్విల భేటీకి అనేక కారణాలు చెబుతున్నప్పటికీ ఈ భేటీ ఒక్కసారిగా బీహార్‌లో రాజకీయ ఉత్కంఠకు తెర లేచినట్లైంది. సమాచార కమిషనర్ నియామకమే ఈ సమావేశం ఉద్దేశమని తేజస్వి చెప్పారు. ఇది జరిగిన తర్వాత కూడా కేవలం సమాచార కమిషనర్ నియామకానికే పరిమితం కాలేదన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి.రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కూడా ఇరువురు నేతల మధ్య చర్చ జరిగినట్లు రాజకీయ నిపుణులు భావిస్తున్నారు. బీహార్‌లో పొలిటికల్ గేమ్ గురించి ఊహాగానాలు జరుగుతున్నాయి. ఎందుకంటే 2022 లో తేజస్వి, నితీష్ మధ్య అలాంటి సమావేశాలు జరిగాయి. ఆపై రాష్ట్ర రాజకీయ ఆట మారిపోయింది. అదే సమయంలో తేజస్వి యాదవ్ కుల గణన చేయాలనే డిమాండ్‌తో నితీష్‌ను కలిశారు. తేజస్వి డిమాండ్ సహేతుకమైనదని నితీశ్ భావించారు. దీని తరువాత, దీనికి సంబంధించి రెండవ సమావేశం కూడా జరిగింది. దీంతో నితీష్ కుమార్ ఎన్డీయే నుంచి పార్టీ మారి మహాకూటమిలో చేరారు. బీహార్‌లో మహాకూటమి ప్రభుత్వం ఏర్పడింది.నితీష్ కుమార్, తేజస్వి యాదవ్ మధ్య మరోసారి భేటీ జరిగింది. నితీష్ కుమార్ ఎన్డీయే శిబిరంలో చేరిన ఎనిమిది నెలల తర్వాత తేజస్వి యాదవ్‌తో వన్ టు వన్ సమావేశం జరిగింది. అయితే లోక్‌సభ ఎన్నికల అనంతరం పాట్నా నుంచి ఢిల్లీకి వస్తున్న విమానంలో వారిద్దరూ కలిసి కనిపించారు. ఇద్దరు రాజకీయ నాయకులు కలిస్తే కేవలం ఎజెండాపైనే చర్చించుకోరని, ఒకరి యోగక్షేమాలు మరొకరు ఆరా తీయరని రాష్ట్ర సమాచార కమిషనర్ అంశంపై నితీష్‌తేజస్వీల భేటీపై రాజకీయ విశ్లేషకులు వాదిస్తున్నారు. వారు రాజకీయ విషయాలు, రాజకీయ సమీకరణాలపై కూడా ఒకరి మనస్సును మరొకరు తీసుకుంటారు. అందుకే నితీష్ - తేజస్వి మధ్య భేటీ రాజకీయ అర్థం మారుతోందంటున్నారు నిపుణులు.ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ సింగపూర్‌లో హెల్త్ చెకప్ చేయించుకుని తిరిగి వచ్చిన తర్వాత యాక్టివ్‌గా ఉన్నారు. రాగానే ఆయన రాజకీయ కార్యకలాపాలు కూడా జోరందుకున్నాయి. తేజస్వి యాదవ్ బీహార్ పర్యటనకు వెళ్లనున్నారు.పాట్నాకు చేరుకునే నేతల ప్రక్రియ కూడా మొదలైంది. ఇలాంటి పరిస్థితుల్లో రాజకీయంగా ఊహాగానాలు కూడా వస్తున్నాయి. మొత్తానికి వేగంగా మారుతున్న రాజకీయ భేటీలు బీహార్‌లో ఏ మలుపు తిప్పుతాయో వేచి చూడాల్సిందే..!

## గజగజలాడిస్తున్న గోదావరి

**జయభేరి, రాజమండ్రి, సెప్టెంబర్ 5:**

కృష్ణానది, బుడమేరు వాగు ఉగ్రరూపంతో విజయవాడ మహానగరం గజగజ వణికింది. మును పెన్నడూ లేనంత వరద ఉగ్రరూపం దాల్చి బెజవాడ నగరాన్ని ముంచెత్తింది. ఎక్కడ చూసినా వరదనీరు పోటెత్తి జనజీవన స్రవంతి అడుగు బయట పెట్టలేని దీనస్థితిలోకి నెట్టింది. 20 మంది ప్రాణాలు బలిగొన్న ఈ వరద బీభత్సం ఇప్పుడిప్పుడే శాంతిస్తోంది. అయితే ఎగువన కురుస్తున్న భారీ వర్షాలు ఓ పక్క ఎగువ నుంచి వెల్లువలా వస్తోన్న వదర ఉద్ధృతి మరోపక్క భారీ స్థాయిలో వరద నీరు గోదావరికి చేరుతోంది. దీంతో గోదావరిలో భారీ స్థాయిలో వరద ఉద్ధృతి పెరుగుతోండగా భద్రాచలం వద్ద బుధవారం రాత్రి నాటికి 41 అడుగుల స్థాయికి నీటిమట్టం చేరింది. ఇది ఆందోళన కలిగించే అంశం కాగా రాగాల 24 గంటల్లో ఈ వరద ఉద్ధృతి మరింత పెరిగే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో అటు తెలంగాణాలోని భద్రాచలం, ఇటు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.ఇప్పటికే భద్రాచలం వద్ద వరద ఉద్ధృతి పెరుగుతుండగా ప్రస్తుతం 41 అడుగుల స్థాయికి వరద ప్రవాహం పెరిగి నిలకడగా ఉంది. ఇది పెరిగే అవకాశం ఉండగా ఈ వరద ప్రవాహం అఖండ గోదావరికి చేరుతోంది. ఈ క్రమంలోనే ధవళేశ్వరం వద్ద వరద ఒరవడి పెరుగుతోంది. ఇదిలా ఉంటే ఏజెన్సీ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు వాగులు పొంగుతున్నాయి. ప్రస్తుతం రాకపోకలకు ఇబ్బంది లేకపోయినా రాబోయే మూడు రోజుల్లో మొన్నటి తరహా భారీ వర్షాలు కురిస్తే మళ్లీ వాగులు పొంగి గోదావరికి వరదలు పోటెత్తే అవకాశాలున్నాయి.బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మూడు రోజులపాటు ఎడతెరిపిలేకుండా భారీ వర్షాలు కురిశాయి. మంగళవారం నుంచి కాస్త తెరుపు ఇచ్చింది వాతావరణం. అయితే కురిసిన భారీ వర్షాలకు పలు లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురైన పరిస్థితి తలెత్తింది. మొన్నటి వరకు వదర ముంపుకు గురై ఇబ్బందులు పడ్డ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాలులో భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో వర్షంనీరుతో ముంపుకు గురై ఇబ్బందులు తప్పలేదు.. ఇక తూర్పుగోదావరి జిల్లా పరిధిలో రాజమహేంద్రవరంలో భారీ వర్షాలకు పలు లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురయ్యాయి.. కాకినాడ జిల్లాలోనూ కూడా భారీ వర్షాలకు చాలా కాలనీలు జలమయమయ్యాయి.. గోదావరికి క్రమక్రమంగా వరద ఉద్ధృతి పెరుగుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది.. ఉభయగోదావరి జిల్లాల్లోని జిల్లా కలెక్టర్లు, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్లు అధికారులను అప్రమత్తం చేస్తూ అత్యవసర సమావేశాలు నిర్వహించారు. భారీ వర్షాలతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి గనుక గోదావరికి వరద పోటెత్తితే ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. గతేడాది గోదావరికి మూడు సార్లు వరదలు పోటెత్తగా ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి ఈ ఏడాది కూడా వరదలు ఎక్కువసార్లు వచ్చే అవకాశాలు లేకపోలేదని నిపుణులు చెబుతున్నారు.




# గన్స్ పట్టుకొని కనిపిస్తా!

'జాతిరత్నాలు' సినిమాలో చిట్టీ పాత్ర ద్వారా యువతరానికి చేరువైంది హైదరాబాదీ సొగసరి ఫరియా అబ్దుల్లా. ప్రస్తుతం ఈ భామ 'మత్తు వదలరా2' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. శ్రీసింహా కోడూరి హీరోగా రితేష్ రానా దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా ఫరియా అబ్దుల్లా పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'ఇదొక థ్రిల్లర్ సబ్జెక్ట్. కథలోని విషాదం నుంచే కామెడీ పుడుతుంది. సినిమాలో నా పాత్ర పేరు సన్నిధి. తను కూడా స్పెషల్ ఏజెంట్' అని చెప్పింది. ఈ సినిమాలో తాను యాక్షన్ సీక్వెన్స్‌లో నటించానని, గన్స్ పట్టుకొని పోరాటాలు చేయడం కొత్త అనుభూతినిచ్చిందని, అలాగే ఓ పాటను రాసి పాడానని ఫరియా అబ్దుల్లా చెప్పింది. 'ఈ టీమ్ అన్ని అంశాల్లో నన్ను ఎంకరేజ్ చేసింది. మళ్లీ వారితో పనిచేయాలనుంది' అని ఆమె పేర్కొంది. ప్రస్తుత తెలుగులో తిరువీర్‌తో కలిసి ఓ లవ్‌స్టోరీలో నటిస్తున్నానని, త్వరలో ఓ తమిళ చిత్రం కూడా ప్రారంభం కాబోతుందని ఫరియా అబ్దుల్లా తెలిపింది.

# దేవర రిలీజ్‌కు రెడీ..

## మరో ప్రాజెక్టుకు జాన్వీకపూర్ సైన్..!

దివంగత అలనాటి అందాల తార శ్రీదేవి కూతురు బాలీవుడ్ భామ జాన్వీకపూర్ తల్లి బాటలో పయనిస్తోంది. హిందీతో వివిధ భాషల్లో తన పాపులారిటీ పెంచుకునే ప్రయత్నంలో ఉంది. ఈ భామ జూనియర్ ఎన్టీఆర్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న దేవర సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుందని తెలిసిందే. ఇప్పటికే విడుదల చేసిన పాటల్లో అదిరిపోయే డ్యాన్స్‌తో అభిమానులను హుషారెత్తిస్తోంది. మరోవైపు బుచ్చి బాబు సానరాంచరణ్ కాంబోలో వస్తోన్న ఆర్‌సీ 16లో కూడా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న జాన్వీకపూర్ తాజాగా మరో సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్న వార్త ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. బీటౌన్ సర్కిల్ టాక్ ప్రకారం జాన్వీకపూర్ ఈ సారి సిద్దార్థ్ మల్హోత్రాతో రొమాన్స్ చేయబోతుంది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కించనున్న ఈ చిత్రాన్ని దినేశ్ జైన్ తెరకెక్కించనున్నాడు. ఈ చిత్రం అర్బన్ రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో బోల్డ్ కథాంశంతో రాబోతుందట. ఇప్పటికే హిందీలో సన్నీ సంస్కారీ కీ తులసీకుమారి సినిమాలో నటిస్తుండగా.. షూటింగ్ దశలో ఉంది. తారక్‌తో నటిస్తోన్న దేవర ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 27న తెలుగు, హిందీతోపాటు పలు ప్రధాన భారతీయ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. దేవర లుక్స్, సాంగ్స్‌ను చూస్తుంటే జాన్వీకపూర్ టాలీవుడ్‌లో లీడింగ్ హీరోయిన్ల జాబితాలో చేరిపోవడం ఖాయమైపోయినట్టే కనిపిస్తుందని ట్రేడ్ పండితులు అభిప్రాయపడుతున్నారు.



# ఒకే ఫ్రేమ్‌లో రిషబ్ శెట్టి, ప్రశాంత్ నీల్, తారక్ ఫ్యామిలీ..



టాలీవుడ్ స్టార్ యాక్టర్ జూనియర్ ఎన్టీఆర్ ఇటీవలే తన తల్లి శాలినితో కలిసి ఉడిపి శ్రీకృష్ణ మఠాన్ని దర్శించుకున్నాడనే సంగతి తెలిసిందే. స్వగ్రామం కుందాపురం ఉడిపి శ్రీకృష్ణ మఠంలో దర్శనం చేసుకోవాలన్న మా అమ్మ కల ఎట్టకేలకు నెరవేరిందంటూ తారక్ ఎక్స్ ద్వారా షేర్ చేసుకున్న ఫొటోలు ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా తారక్ అండ్ ప్రశాంత్ నీల్ ఫ్యామిలీతో కలిసి బీచ్‌లో సందడి చేసిన స్టిల్ కూడా నెట్టింట చక్కర్లు కొడుతోంది. తాజాగా తారక్, ప్రశాంత్ నీల్, కాంతార ఫేం రిషబ్ శెట్టి ఫ్యామిలీ అంతా హిల్ స్టేషన్ అందాలను ఆస్వాదించింది. ఈ సందర్భంగా దిగిన గ్రూప్ ఫొటో ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తారక్ తల్లి శాలినిని కూడా ఈ ఫ్రేమ్‌లో చూడొచ్చు. మొత్తానికి పాన్ ఇండియా ఇమేజ్ ఉన్న స్టార్ యాక్టర్లు, డైరెక్టర్లను ఒకే ఫ్రేమ్‌లో చూసి తెగ మురిసిపోతున్నారు మూవీ లవర్స్. లొకేషన్ స్టిల్ చూస్తే కర్ణాటకలోని ఓ హిల్ స్టేషన్ అని అర్థమవుతోంది. రిషబ్ శెట్టి ప్రస్తుతం కాంతార 2తో బిజీగా ఉన్నాడని తెలిసిందే. మరోవైపు తారక్ నటిస్తోన్న దేవర పార్టు 1 సెప్టెంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేయనుంది. ఇక ప్రశాంత్ నీల్‌తారక్ కాంబోలో ఎన్టీఆర్ 31ను కూడా ప్రకటించగా.. షూటింగ్ ఎప్పుడు షురూ అవుతుందనే దానిపై క్లారిటీ రావాల్సి ఉంది.



# పదిహేనేండ్ల సినీ ప్రయాణం

ఈ సెప్టెంబర్ 5 నాటికి నాగచైతన్య తొలి సినిమా 'జోష్' విడుదలై పదిహేనేండ్లు. ఈ దశాబ్దంన్నర ప్రయాణంలో 28 సినిమాల్లో విభిన్నమైన పాత్రలు పోషించారు నాగచైతన్య. ఆయన 29వ చిత్రం 'తండేల్'. అక్కినేని లెగసీని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తూ తాతకు తగ్గ మనవడిగా, తండ్రికి తగ్గ తనయుడిగా నాగచైతన్య సత్తా చాటుతున్నారని, 'తండేల్'లో చైతూ నట విశ్వరూపాన్ని చూస్తారని గురువారం మేకర్స్ తెలియజేస్తూ, నాగచైతన్యకు సంబంధించిన ఓ న్యూ పోస్టర్‌ని విడుదల చేశారు. సముద్రపు అంచున ఫిషింగ్ బోట్‌పై నిలబడి రగ్గ్‌డ్ అవతార్‌లో చిరునవ్వులు చిందిస్తున్న చైతూ పోస్టర్ అభిమానుల్ని ఆకట్టుకునేలా వుంది. శ్రీకాకుళంలో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతున్నది. సాయిపల్లవి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి చందూ మొండేటి దర్శకత్వం వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి కెమెరా: షామ్‌దత్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఎడిటింగ్: నవీన్ నూలి, నిర్మాత: బన్నీ వాసు, సమర్పణ: అల్లు అరవింద్, నిర్మాణం: గీతా ఆర్ట్స్

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com